క్లుప్తంగా

ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


ఉండ్రాతి రవి

మన్సూరాబాద్: ఎస్టీ ఎరుకల ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆదివాసీ ఎరుకల సంఘం ఎల్‌బీనగర్ అధ్యక్షుడు ఉండ్రాతి రవి డిమాండ్ చేశారు. చేవెళ్ల డిక్లరేషన్‌లో భాగంగా ఎరుకలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.500 కోట్లు ప్రకటిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. ఎరుకల సామాజిక వర్గానికి ప్రాధాన్యం కల్పిస్తామని హామీ ఇచ్చి రెండేళ్లు గడుస్తున్న అమలు చేయకపోవడం బాధాకరమని ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి ఏకలవ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

మందుబాబు హల్‌చల్

ట్రాఫిక్ ఎస్సైపై దాడికి యత్నం

సైదాబాద్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ మందుబాబు హల్‌చల్ చేసాడు. ట్రాఫిక్ ఎస్సైపై దాడికి యత్నించడంతో సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు శనివారం సాయంత్రం చంపాపేట చౌరస్తాలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా అటుగా ద్విచక్ర వాహనంపై వచ్చిన సింగరేణి కాలనీకి చెందిన వేమూరు శంకర్ (30)ను తనిఖీ చేయగా మద్యం తాగినట్లు నిర్ధారణ అయింది. ఈ క్రమంలో శంకర్ తన చొక్కా విప్పి రహదారిపై కొంత సేపు హంగామా చేసాడు. తనకు తనిఖీ చేసిన ట్రాఫిక్ ఎస్సై వెంకటప్పపై దాడి చేయడానికి యత్నించాడు. సమాచారం అందుకున్న సైదాబాద్ పోలీసులు శంకర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

నియామకం


బొల్లు కుమార్‌యాదవ్‌కు నియామకపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మహేశ్వరం: మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ కో–ఆర్డినేటర్‌గా సుభాన్‌పూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బొల్లు కుమార్‌యాదవ్ నియమితులయ్యారు. శనివారం తుక్కుగూడలోని క్యాంపు కార్యాలయంలో ఆయనకు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం తనవంతు కృషి చేస్తామన్నారు. బీసీల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. మండలంలో ప్రతి గ్రామంలో పర్యటించి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతీ ఒక్కరికి తెలియజేసి కాంగ్రెస్ పార్టీపై ఆకర్శితులను చేస్తామన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం తనవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కాకి ఈశ్వర్‌ముదిరాజ్, ఎస్టీ సెల్ మండల మాజీ అధ్యక్షుడు నేనావత్ రాజునాయక్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు


డీజీపీ శివధర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న పారిజాత, నర్సింహారెడ్డి

బడంగ్‌పేట్: రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు చేపట్టిన బత్తుల శివధర్‌రెడ్డిని శనివారం లక్డికపూల్‌లోని డీజీపీ కార్యాలయంలో బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగురింత పారిజాత, నర్సింహారెడ్డి దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.


మలక్‌పేటలోని ఓ అంగన్‌వాడీ కేంద్రం

ఇన్‌చార్జ్‌లే దిక్కు!

- అంగన్‌వాడీల్లో టీచర్ల కొరత
- మలక్‌పేటలో ఒక్కో టీచర్‌కు 2, 3 సెంటర్ల బాధ్యత
- కొన్ని చోట్ల ఖాళీగా ఆయా పోస్టులు
- పనిభారంతో ఉక్కిరిబిక్కిరి

చాదర్‌ఘాట్: అంగన్వాడీ టీచర్ల కొరతతో సమీపంలోని కేంద్రం టీచర్లకు అదనపు బాధ్యతలు ఇచ్చి నెట్టుకొస్తున్నారు. మలక్‌పేటలోని చాలా కేంద్రాల్లో ఉద్యోగ విరమణ పొందిన వారి స్థానాల్లో కొత్తవారిని భర్తీ చేయలేక, ఒక్కో అంగన్‌వాడీ టీచర్‌కు రెండు, మూడు కేంద్రాల బాధ్యతలను అప్పగిస్తున్నారు. పనిభారం పెరగటంతో వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. చిన్నారులకు చదువు చెప్పే పరిస్థితి లేకపోవటంతో తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలను పంపించేందుకు విముఖత చూపుతున్నారు. నాలుగోవంతు కేంద్రాల్లో టీచర్లు లేనట్లు తెలిసింది.

ఆయా పోస్టులు సైతం ఖాళీ..

చార్మినార్, మలక్‌పేట, అంబర్‌పేట నియోజకవర్గంలో మొత్తం 214 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 50 కేంద్రాలలో టీచర్లు లేరు. అదే విధంగా దాదాపు 110 మంది ఆయాల పోస్టులు సైతం ఖాళీగా ఉన్నాయి. ప్రతి నెల పదుల సంఖ్యలో పదవీ విరమణ పొందిన వారి స్థానాల్లో వారిని నియమించకుండా సమీపంలో ఉన్న సెంటర్ల టీచర్లకు నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తున్నారు. సుమారు 50 సెంటర్లలో ఇన్‌చార్జిలే కొనసాగుతున్నారు.

అదనంగా బీఎల్‌ఓ డ్యూటీలు

అంగన్‌వాడీ టీచర్లకు బూత్‌లెవల్ డ్యూటీలు కేటాయిస్తున్నారు. పనిభారంతో పరివేక్షణ కొరవడి తూతూ మంత్రంగా సెంటర్లను నిర్వహిస్తున్నారని ఆరోపణలు విన్పిస్తున్నాయి. 2025 మేలో మెయిన్ అంగన్‌వాడీ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేసింది. ఈ కేంద్రాలలో ఆయాలను నియమించాల్సి ఉంది. టీచర్లపై పనిభారం పెరగటంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామని, వంట పనులు, పిల్లల సంరక్షణ, పోషకాహారం అందిచడం ఇబ్బందికరంగా మారిందని పలువురు టీచర్లు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి టీచర్లు లేని అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించి పూర్తిస్థాయిలో నియమించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి


మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన కోట్ల శ్రీనివాస్, మస్రత్ సుల్తానా

చాదర్‌ఘాట్: త్వరలో జరగబోయే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ తరుపున ప్రచారంలో పాల్గొనాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. శనివారం గాంధీభవన్‌లో దసరా సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోట్ల శ్రీనివాస్, డైరెక్టర్ మస్రత్ సుల్తానా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్ అభివృద్ధిపై దృష్టి సారించాలని, రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా పని చేయాలని మంత్రి సూచించినట్లు పేర్కొన్నారు.

వెంకట పతంజలికి దసరా పురస్కారం


తాడేపల్లి వెంకట పతంజలికి పురస్కారం అందజేస్తున్న డా.జ్ఞానకుమార్

నాగోలు: ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఆచార్య తాడేపల్లి వెంకట పతంజలి చేసిన అనేక ఆధ్మాత్మిక ప్రసంగాలు ఎంతో మందిని కదిలించాయని కొమ్మరాజు ఫౌండేషన్ అధ్యక్షులు డా.జ్ఞానకుమార్ అన్నారు. శనివారం కొత్తపేట డివిజన్ కొమ్మరాజు ఫౌండేషన్, న్యూ నాగోలు సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో ఆచార్య తాడేపల్లి వెంకట పతంజలికి దసరా పురస్కారం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా జ్ఞానకుమార్ మాట్లాడుతూ.. తాడేపల్లి పతంజలి అసోసియేట్ ప్రొఫెసర్ గ్రేడ్‌లో పదవీ విరమణ చేసిన అనేక ఆధ్యాత్మిక ప్రసంగాలు వివిధ టీవీ చానల్స్‌లో వస్తున్నాయన్నారు. అంతర్యామి అలిసితి సొలసితి అన్న ఒక్క అన్నమయ్య కీర్తన చేసిన పతంజలి ప్రేక్షకులను మంత్రం ముగ్ధుల్ని చేశారు. అన్నమయ్య రాసిన 32000 కీర్తనలలో 15195 మటుకే ప్రస్తుతం లభిస్తున్నాయని ఇటీవల ప్రచురించిన అన్నమయ్య పద పుష్కరిణీ అన్న పుస్తకంలో 111కీర్తనలకు వ్యాఖ్యానం రాశారన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ శ్యామల, ప్రశాంత్ కొమ్రాజు, కెఎస్ఎన్ మూర్తి, సంజీవరాణి, లలిత, పరుశురాం, ఆశాలత, కళావతి, పనాల శ్రీరాములు, నరసింహారావు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి ఊరేగింపు


అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

వనస్థలిపురం: వనస్థలిపురం ప్రశాంత్‌నగర్‌లోని కనకదుర్గ దేవాలయం కల్యాణ మండపంలో దేవి శరన్నవరాత్రుల సందర్భంగా 11 రోజులపాటు పూజలందుకున్న అమ్మవారిని శనివారం నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రశాంత్‌నగర్ కాలనీలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో సంరెడ్డి భుజంగరెడ్డి, నందారెడ్డి, యుగంధర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సందడిగా అమ్మవారి నిమజ్జనం

చైతన్యపురి: శరన్నవరాత్రి ఉత్సవాల అనంతరం దుర్గామాత విగ్రహాల నిమజ్జనం సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌పై సందడిగా సాగింది. నిమజ్జనం కోసం రెండు క్రేన్లు ఏర్పాటు చేసినట్లు సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపారు. గురువారం 65, శుక్రవారం 110, శనివారం సాయంత్రం వరకు 20 విగ్రహాలు నిమజ్జనం జరిగాయన్నారు.

7న వీరాంజనేయస్వామి ఆలయంలో తైబజార్ వేలం

మహేశ్వరం: మండల పరిధిలోని ఘట్టుపల్లి శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో ఈ నెల 7వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. టెంకాయలు–పూజా సామగ్రి, పూలకు సంబంధించిన వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ముందుగా డిపాజిట్ చేయాలన్నారు. ఆసక్తి కలిగిన వారు పాల్గొనాలని, పూర్తి వివరాలకు దేవాదాయ శాఖ అధికారులు, సిబ్బందిని సంప్రదించాలన్నారు.

ఆర్య వైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి



సైదాబాద్: ఆర్య వైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ సూచించారు. ఇటీవల గ్రూప్–1లో ఉద్యోగాలు సాధించిన పలువురు యువకులను శనివారం మహాసభ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆర్యవైశ్యులు వ్యాపారాలకే పరిమితం కాకుండా ప్రభుత్వ ఉద్యోగాలను సాధించడం అభినందనీయమన్నారు. ఈ ర్యక్రమంలో గణేష్‌గుప్తా, మల్లికార్జున్ గుప్తా, వెంకటేష్, లక్ష్మణ్ గుప్తా, చింతల రవికుమార్ పాల్గొన్నారు.

బస్ షెల్టర్లు నిర్మించాలి


మాట్లాడుతున్న కీసరి నర్సిరెడ్డి

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా గతంలో ఉన్న బస్ షెల్టర్లను తొలగించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఎల్‌బీనగర్ సర్కిల్ సీపీఎం కార్యదర్శి కీసరి నర్సిరెడ్డి అన్నారు. శనివారం ఎల్‌బీనగర్ సర్కిల్ సీపీఎం పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా బస్ షెల్టర్లు లేని ప్రాంతంలో వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు.రోడ్డు విస్తరణ పనులలో తీవ్ర జాప్యంతో ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఈ జాతీయ రహదారి నిత్యం రద్దీగా ఉండడంతో రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. రద్దీగా ఉండే జంక్షన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలని కోరారు. ఈ సమావేశంలో గణేష్‌గౌడ్, నరహరి, భిక్షపతి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, గంగుల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి

సంతోష్‌నగర్: డబ్బు విషయంలో జరిగిన గొడవలో ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కమల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..కంచన్‌బాగ్ స్టేషన్ పరిధిలో హఫీజ్‌బాబానగర్‌కు చెందిన షేక్ సైఫ్ (25), అహ్మద్ బిన్ అబ్దుల్లా బావజీర్‌ల మధ్య శనివారం రూ.30 వేల హ్యాండ్ లోన్ విషయంలో గొడవ జరిగింది. దీంతో తీవ్ర కోపోద్రేక్తుడైన అహ్మద్ బిన్ అబ్దుల్లా బావజీర్ తన వెంట తెచ్చుకున్న కత్తితో షేక్ మెడ, భుజాలపై దాడి చేశాడు. ఈ దాడిలో గాయపడిన షేక్ సైఫ్‌ను చికిత్స నిమిత్తం ఒవైసీ ఆసుపత్రికి తరలించారు.

దుండగులను అరెస్ట్ చేయాలి


దేవాలయాన్ని సందర్శించిన సామ రంగారెడ్డి

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధి నందనవనంకాలనీలో ఏర్పాటు చేసిన కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో విగ్రహాన్ని తొలగించిన దుండగులను అరెస్ట్ చేయాలని ఎల్‌బీనగర్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన కన్యకాపరమేశ్వరి దేవాలయాన్ని సందర్శించిన అనంతరం మాట్లాడారు. దేశవ్యాప్తంగా ప్రజలు దసరా పండుగ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ అమ్మవారి ఆశీర్వాదం పొందుతున్న సమయంలో నందనవనంలో ఇలాంటి దుర్మార్గమైన చర్య జరగడం హిందూ భావాలను దెబ్బతీయడమేనని రంగారెడ్డి అన్నారు. ఇటీవల భాగ్యనగరంలో దేవాలయాలపై దాడులు, విగ్రహాల అపవిత్రతకు భంగం వాటిల్లుతుందని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్, గజ్జల రాజుగౌడ్ గౌని వెంకటేశ్‌గౌడ్, కాటన్ శేఖర్‌గౌడ్, పాశం జీవన్‌రెడ్డి, చంద్రకాంత్, శ్రీకాంత్‌గౌడ్ మల్లేశ్‌యాదవ్, రాజు ముదిరాజ్, అంజి ముదిరాజ్, శ్రీనివాస్‌యాదవ్, సుదీర్, స్వరూప, లక్ష్మీ పాల్గొన్నారు.

బీసీల చైతన్యమే లక్ష్యం


నరహరిని సన్మానిస్తున్న కటకం నర్సింగ్‌రావు

నాగోలు: బీసీల చైతన్యమే లక్ష్యమని మన ఆలోచన సాధన సమితి(మాస్) వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్‌రావు అన్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి, పబ్లిక్ సెక్రటరీ పరికిపండ్ల నరహరి శుక్రవారం రాత్రి నాగోలులో కటకం నర్సింగ్‌రావు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి బీసీ చైతన్యం, బహుజన ఏకతపై చర్చించారు. తాను చేసే ప్రతి కార్యక్రమానికి మీ సహకారం కావాలని కటకం నర్సింగ్‌రావు కోరగా పరకిపండ్ల నరహరి సానుకూలంగా స్పందించారు. సీనియర్ ఐఏఎస్ అధికారిగా దేశంలోనే ప్రధాన నగరమైన మధ్యప్రదేశ్‌లో విధులు నిర్వర్తిస్తూ బీసీ ఉద్యమానికి సహకారం అందించడం అభినందనీయమని కటకం నర్సింగ్‌రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దవూర బ్రహ్మయ్య, నరహరి, నక్క కాశీనాథ్, మహంకాళి శివుడు, మారోజు రాజు, కస్తూరి అశోక్, ఋషి పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేయాలి


గణేష్‌ను సన్మానిస్తున్న భరత్‌కుమార్

మలక్‌పేట: తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా యువత పని చేయాలని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుండే అన్నారు. మూసారంబాగ్ డివిజన్‌లో శనివారం ఆయన పర్యటిస్తూ మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు ఎండగట్టి ప్రజలను చైతన్య పర్చాలన్నారు. ప్రధాని మోదీపాలన, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. భాగ్యనగర్ జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు అనుముల భరత్‌కుమార్ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం గళం విప్పుతూ జిల్లాలో బీజేవైఎంను మరింతగా బలోపేతం చేసే దిశగా ముందుకు సాగుతామన్నారు.ఈ కార్యక్రమంలో నిరంజన్ యాదవ్, లడ్డూయాదవ్, దేవేందర్, గజానంద్, అనిల్, భార్గవ్‌చారి,ప్రశాంత్ పాల్గొన్నారు.



సరూర్‌నగర్ మినీట్యాంక్‌బండ్ వద్ద అమ్మవారి విగ్రహం నిమజ్జనం చేస్తుండగా ఓ భారీ క్రేన్ అదుపు తప్పడంతో ముందు భాగం ఒక్కసారిగా గాలిలోకి లేచింది. అప్రమత్తమైన పోలీసులు, స్థానికులు తాళ్ల సహాయంతో కిందకు లాగారు. క్రేన్ డ్రైవర్‌కు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కట్టపై నేల కుంగిపోవటంతో ఈ ఘటన జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. – చైతన్యపురి

ముగిసిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని ఐసీఏఆర్–క్రీడాలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు శనివారం ముగిశాయి. కార్యక్రమాల్లో భాగంగా స్వచ్ఛతా ప్రతిజ్ఞ, చెట్లను నాటడం, కార్యాలయాల్లో పరిశుభ్రత డ్రైవ్, పాత రికార్డులను తొలగించడం, పారేయడం, పారిశుద్ధ్య డ్రైవ్, బయోడిగ్రేడబుల్, బయోడిగ్రేడబుల్ కాని వ్యర్థాలను వేరు చేయడం, పాఠశాల పిల్లలు, గ్రామ నివాసితులు పాల్గొన్న గ్రామాల్లో పారిశుద్ధ్య డ్రైవ్, స్వచ్ఛత అనే అంశంపై రంగోలి, వ్యాస రచన పోటీలు, గ్రామాల్లో స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా క్రీడా డైరెక్టర్ వినోద్ కుమార్ సింగ్ మాట్లాడుతూ..మన దైనందిన జీవితంలో పరిశుభ్రతను కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. అనంతరం రంగోళి, వ్యాసరచన పోటీల విజేతలకు డైరెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ సింగ్ బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీఏఆర్–క్రీడా శాస్త్రవేత్త డాక్టర్ సువాన సుకుమారన్ తదితరులు పాల్గొన్నారు.


బహుమతులను అందజేస్తున్న వినోద్ కుమార్ సింగ్


బజాజ్ ఎలక్ట్రానిక్ ముందు ఏర్పడిన గుంతలో నిలిచిన నీరు


నాగోలు సాయినగర్ కాలనీ ప్రధాన రహదారిపై ఇలా..

రోడ్డంతా గుంతలు.. వాహనదారులకు తిప్పలు

తరచూ కురుసున్న వర్షాలతో ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని కొత్తపేట, నాగోలు డివిజన్ పరిధిలోని రహదారులు గుంతలుగా మారాయి. వివిధ కాలనీల్లోని అంతర్గత రోడ్లపై భారీగా గుంతలు ఏర్పడటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వర్షం నీరు గుంతల్లో నిల్వడంతో వాహనదారులకు కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. కొత్తపేట డివిజన్ పరిధి మారుతినగర్, మోహన్‌నగర్, న్యూనాగోలు కాలనీలోని రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. నాగోలు డివిజన్ పరిధిలో నాగోలు చౌరస్తా నుంచి ఎల్‌బీనగర్‌కు వెళ్లే రోడ్డులో ఉన్న సాయినగర్ కాలనీ, అనంతుల కాలనీ మెయిన్ రోడ్డులో సర్వీస్‌లో ఎక్కడ చూసిన గుంతలే దర్శనమిస్తున్నాయి. రోడ్లపై ఏర్పడిన గుంతలకు మరమ్మతు చేయాలని పలుమార్లు సంబంధిత అధికారులతో మొర పెట్టుకున్నా స్పందించడం లేదని ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని ఆయా ప్రాంతాల వాసులు కోరుతున్నారు. నాగోలు


కొత్తపేటలో రోడ్డుపై ఏర్పడిన గుంతలు